క్లుప్తంగా

టీపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్‌గా ఐలయ్య



పెద్దవంగర: టీపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్‌గా సోమారపు ఐలయ్య నియమితుల య్యాడు. ఈ మేరకు టీపీటీ ఎఫ్ మండల అధ్యక్షుడు చిక్కాల సతీష్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపాడు.

కలెక్టర్‌కు వినతి

మహబూబాబాద్: టీజీఓ సంఘం భవన నిర్మాణం కోసం స్థలాన్ని కేటాయించాలని టీజీఓ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం సంఘం జిల్లా అధ్యక్షుడు మహ్మద్ రఫీ మాట్లాడారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ప్రసాద్, సురేష్, హరిప్రసాద్, రాజశేఖర్, నరేష్, సోమ్లా పాల్గొన్నారు.

ఎల్ఈడీ టీవీ బహూకరణ

కురవి: మండలంలోని బలపాల గ్రామంలోని ప్రాథమిక పాఠశాలకు అదే గ్రామానికి చెందిన పూర్వ విద్యార్థి, హార్డ్‌వేర్ ఇంజనీర్ కొప్పుల రవికుమార్ తండ్రి కొప్పుల వెంకన్న జ్ఞాపకార్థం మంగళవారం రూ.12వేల విలువైన ఎల్ఈడీ టీవీని బహూకరించాడు. ప్రముఖ డాక్టర్ దేవులపల్లి కేశవరావు ప్రోత్సాహంతో పాఠశాల హెచ్‌ఎం తేలుకుంట్ల సునీతకు దాత రవికుమార్ అందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నరసింహారెడ్డి, సీఆర్‌పీ ఉమ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

మరిపెడ రూరల్: నేటి సమాజంలో మహిళలు, బాలికలపై జరుగుతున్న అకృత్యాలపై అప్రమత్తంగా ఉండాలని మహబూబాబాద్ షీ టీం ఎస్సై సునంద అన్నారు. మంగళవారం మండలంలోని ఎల్లంపేట జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో సమాజంలో జరుగుతున్న నేరాలు, మహిళలు, బాలలపై జరుగుతున్న అకృత్యాలు, సైబర్ క్రైం, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, మానవ రవాణా తదితర అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో పార్వతి, అరుణ, కైలాస్, హెడ్ కానిస్టేబుల్ ఉమామహేశ్వర్ రావు, రమేష్, నవీన్ పాల్గొన్నారు.

రేపు వాహనాల వేలం

గూడూరు: మండల కేంద్రంలోని ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో పలు కేసుల్లో పట్టుబడిన వాహనాల వేలంపాట గురువారం నిర్వహించనున్నట్లు శాఖ సీఐ ఎన్.భిక్షపతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అశోక్‌లే లాండ్ మినీ గూడ్స్ పాటలో పాల్గొనే వారు ముందుగా రూ. 50వేలు, ద్విచక్రవాహనాల వేలంలో పాల్గొనే వారు రూ.20వేలు ఈఎండీగా చెల్లించాలని సూచించారు. ఉదయం 10గంటలకు వేలంపాట జరుగుతుందని తెలిపారు.

మహిళ ఆత్మహత్య

గూడూరు: కుటుంబ కలహాలతో ఓ మహిళ పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని గాజులగట్టు శివారు వస్త్రాంతండాలో మంగళవారం నెలకొంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బోడ చిలకమ్మ(55) భర్త ఈర్యాతో కలిసి జీవనం కొనసాగిస్తుంది. వారికి ఇద్దరు కొడుకులు ఉండగా పెళ్లిళ్లు అయ్యాయి. చిన్న కొడుకు వద్ద ఉంటున్న చిలకమ్మ కుటుంబ కలహాలతో సోమవారం ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగింది వెంటనే కుటుంబ సభ్యులు మానుకోట ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ తెల్లవారు జామున మృతి చెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఒత్తిడి తగ్గించాలి

తొర్రూరు: కుటుంబ సర్వే చేస్తున్న ఎన్యుమరేటర్లపై ఒత్తిడి తగ్గించాలని టీపీటీఎఫ్ మండల అధ్యక్షుడు కొండం జనార్దన్, ప్రధాన కార్యదర్శి కొలుపుల శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు మంగళవారం డివిజన్ కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ నర్సింగ రావుకు వినతిపత్రం సమర్పించారు. స్వామి, లింగా, సునీత, ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

నెల్లికుదురు: సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వే నిర్వహిస్తున్న ఉపాధ్యాయులైన ఎన్యుమరేటర్లపై ఒత్తిడి తగ్గించి గడువు పెంచాలని టీపీటీఎఫ్ మండల అధ్యక్షుడు యాకయ్య ప్రభుత్వాన్ని కోరారు. ఈమేరకు మంగళవారం ఎంపీడీఓ బాలరాజుకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో శ్రీనివాస్, పద్మావతి, వెంకన్న పాల్గొన్నారు.

సన్మానం

మహబూబాబాద్ అర్బన్: హైదరాబాద్ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం అందిస్తున్న ప్రతిష్టాత్మకమైన పురస్కారాల్లో భాగంగా జిల్లా కేంద్రానికి చెందిన రచయిత్రి, ఉపాధ్యాయురాలు డాక్టర్ తాళ్లపల్లి యాకమ్మ ఉత్తమ గ్రంథ పురస్కారం మంగళవారం అందుకున్నారు. ఆమె రచించిన 'కెరటం' నవలకు ఎన్టీఆర్ కళామందిర్‌లో రిటైర్డ్ ఐఏఎస్ కె.వి.రమణాచారి సత్కరించారు.

ప్రభుత్వం ఆదుకోవాలి

తొర్రూరు: గిరిజన జర్నలిస్టులను ప్రభుత్వం ఆదుకోవాలని ట్రైబల్ జర్నలిస్టు అసోయేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు లావుడ్య రాము నాయక్, జిల్లా అధ్యక్షుడు తేజావత్ రవినాయక్ కోరారు. మంగళవారం డివిజన్ కేంద్రంలో వారు మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి యాదగిరినాయక్, బాలాజీ నాయక్, రవి, లింగానాయక్, సుధాకర్ పాల్గొన్నారు.

'అమ్మహస్తం' కోసం ఎదురుచూపులు

- గతంలో పీడీఎస్ ద్వారా 9రకాల సరుకుల పంపిణీ
- ఒక్కొక్కటిగా తగ్గిస్తూ.. బియ్యానికే పరిమితం



రేషన్‌షాపులో బియ్యం తీసుకుంటున్న లబ్ధిదారులు (ఫైల్)

గూడూరు: పేద, మధ్య తరగతి ప్రజలకు తక్కువ ధరలకు నిత్యావసర సరుకులు అందించాలనే ఉద్దేశంతో ప్రజాపంపిణీ వ్యవస్థ ఏర్పాటైంది. అందులో భాగంగా బియ్యం, గోధుమలు, చెక్కర, కిరోసిన్, కారంపొడి, పసుపు, చింతపండుతో కలిపి అమ్మహస్తం పేరుతో తొమ్మిది రకాల నిత్యావసర సరుకులను రేషన్ దుకాణాల ద్వారా అందించే వారు. అలాంటి వాటిని పౌర సరఫరాల శాఖ ఒక్కొక్కటిగా తగ్గిస్తూ బియ్యానికే పరిమితం చేసింది. ఫలితంగా బహిరంగ మార్కెట్‌లో నిత్యావసర వస్తువులను కొనలేక పేద ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

బియ్యానికే పరిమితం

గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమ్మహస్తం పేరుతో తొమ్మిది రకాల వస్తువులను తెల్లరేషన్ కార్డు కలిగిన లబ్ధిదారులకు పంపిణీ చేసింది. కానీ తరువాత వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం సరుకులను తగ్గించింది. పౌర సరఫరాల శాఖ ద్వారా ఆహార భద్రత కార్డుదారుల కుటుంబంలో ఒక్కొక్కరికి 6కిలోలు, అంత్యోదయ కార్డు ఉన్న వారికి 35కిలోల బియ్యాన్ని పంపిణీ చేస్తున్నారు.

ఆర్థికంగా ఇబ్బందులు

నేటికి గ్రామాల్లో పేద, మధ్య తరగతి ప్రజలు ఎక్కువగా రేషన్ షాపుల ద్వారా అందించే సరుకులపైనే ఆధారపడిన వారు ఉన్నారు. మార్కెట్‌లో నిత్యావసర వస్తువుల ధరలు చుక్కలను అంటాయి. దీంతో పేద, మధ్య తరగతి ప్రజలు ఆర్థికంగా నష్టపోతున్నారు. వీరిపై భారం పడకుండా ఉండాలంటే నిత్యావసర వస్తువులను ప్రజాపంపిణీ ద్వారా అందిస్తూ, ఆ వ్యవస్థ నిర్వీర్యం కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపైనే ఉంది. ఇప్పటికైనా కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం సన్నం బియ్యంతోపాటు తొమ్మిది రకాల వస్తువులను అమ్మహస్తం పేరుతో అందిస్తుందన్న ఆశతో ప్రజలు ఎదురు చూస్తున్నారు.

సరుకులు రావడంలేదు



గతంలో రేషన్ షాపుల్లో బియ్యంతో పాటు 9రకాల సరుకులు వచ్చేవి. అప్పుడు ఇల్లు సాఫీగా గడిచేది. ఇపుడు ఒక్క దొడ్డు బియ్యం ఇస్తున్నారు, అవి తినలేకపోతున్నాం. కూలీ చేయగా వచ్చిన డబ్బులతో దుకాణంలో సన్నం బియ్యం కొని వండుకుంటున్నాం.

- సుల్తాన, లబ్ధిదారు, గూడూరు

అధికారులపై దాడి హేయమైన చర్య



గూడూరు: నిరసన తెలుపుతున్న తహసీల్దార్, ఉద్యోగులు



నెల్లికుదురు: నిరసన తెలుపుతున్న రెవెన్యూ అధికారులు

నెల్లికుదురు: నిత్యం ప్రజలకోసం పాటు పడే కలెక్టర్, రెవెన్యూ అధికారులపై దాడులు చేయడం దారుణమని తహసీల్దార్ కోడిచింతల రాజు ఆవేదన వ్యక్తం చేశాడు. మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయం ముందు మంగళవారం రెవెన్యూ ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ తరంగిణి, ఆర్ఐ రహెమాన్, సీనియర్ అసిస్టెంట్ కోటేశ్వర్‌రాజు పాల్గొన్నారు.

గూడూరు: కలెక్టర్, రెవెన్యూ ఉద్యోగులపై జరిగిన సంఘటనకు తహసీల్దార్ శ్వేత, ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డీటీ కోమల, ఎమ్మార్ఐ మల్లయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

గార్ల: గార్లలో రెవెన్యూ ఉద్యోగులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో డీటీ జర్పుల సుధాకర్, సీనియర్ అసిస్టెంట్ శ్రీరామ్, ఆర్ఐలు రామకృష్ణ, స్వప్న, సిబ్బంది పాల్గొన్నారు.

తొర్రూరు/పెద్దవంగర: డివిజన్ కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయంలో సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. తహసీల్దార్లు శ్రీనివాస్, మహేందర్, ఆర్ఐ లస్కర్, నరేంద్రరాజు, శ్రీష, ఎస్కే పర్వీన్ పాల్గొన్నారు.

బాలికలు అన్నిరంగాల్లో రాణించాలి



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న పోలీసులు, ఉపాధ్యాయులు

మహబూబాబాద్ అర్బన్: బాలికలు విద్యతోపాటు అన్నిరంగాల్లో రాణించాలని ప్రభుత్వ పాఠశాల ప్రిన్సిపాల్ వీరయ్య అన్నారు. మానుకోట మున్సిపాలిటీ పరిధిలో ఈదుల పూసపల్లి ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం షేర్ స్వచ్ఛంద సంస్థ, కైలాష్ సత్యార్థి పిల్లల ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాల్యవివాహాలు, అక్రమ రవాణా, లైంగిక వేధింపులపై అవగాహన నిర్వహించారు. అనంతరం తస్మాత్ జాగ్రత్త వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో రైల్వే ఆర్పీఎఫ్ ఎస్సై సుభాని, షేర్ స్వచ్ఛంద సంస్థ కోఆర్డినేటర్ వసుంధర, హిమబిందు, ఉష, పారా మెడికల్ శోభ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మానుకోటలో ఆటో చోరీ

మహబూబాబాద్ రూరల్: ఇంటి ముందు పార్కింగ్ చేసిన ఆటోను దర్జాగా దొంగలు తీసుకునిపోయిన సంఘటన జిల్లా కేంద్రంలో ఆలస్యంగా వెలుగు చూసింది. బాధితుడు గుగులోత్ రాజ్ కుమార్ స్వామి తెలిపిన వివరాల ప్రకారం.. అయ్యప్ప స్వామి దీక్ష స్వీకరించిన రాజ్ కుమార్ జిల్లా కేంద్రంలోని అన్నపూర్ణ కాంప్లెక్స్ పక్కన గల్లీలో ఓ ఇల్లు అద్దెకు తీసుకుని తోటి మాలధారులతో కలిసి కుటీరం ఏర్పాటు చేసుకుని ఉంటున్నారు. రోజు మాదిరిగానే స్వామి తన ఆటోను ఈనెల 8వ తేదీ శుక్రవారం రాత్రి అక్కడే పార్కింగ్ చేసి ఇంటికి వెళ్లిపోయాడు. శనివారం ఉదయం వచ్చి చూసే సరికి ఆటో కనిపించకపోవటంతో చుట్టుపక్కల వెతికాడు. పట్టణంలోని పలుచోట్ల గాలించినా ఆటో లభించక పోవడంతో సీసీ కెమెరాల్లో రికార్డు అయిన దృశ్యాల ఆధారంతో మహబూబాబాద్ టౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్ కేసు నమోదు చేసి విచారణ చేపట్టాడు.

జీపీ కార్మికుల ప్రాణాలకు రక్షణ కరువు



మాట్లాడుతున్న కొత్తపల్లి రవి

తొర్రూరు: పంచాయతీ కార్మికుల ప్రాణాలకు రక్షణ కరువైందని ప్రగతిశీల పంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కొత్తపల్లి రవి అన్నారు. డివిజన్ కేంద్రంలో సోమవారం పంచాయతీ వర్కర్స్ యూనియన్ సమావేశం నిర్వహించారు. రవి మాట్లాడుతూ.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చింతల తండాలోని పంచాయతీ కార్మికుడు చరణ్ విధి నిర్వహణలో 11కేవీ విద్యుత్ వైరు తగిలి మృతి చెందాడని, బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకోవాలన్నారు. ప్రాణాలు కోల్పోతున్నా కార్మికులకు ప్రభుత్వం నుంచి ఎటువంటి సాయం అందడం లేదన్నారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు పాద్య బీకు, మండల అధ్యక్షుడు గుండాల సోమనర్సయ్య, నాయకులు తండా లింగమూర్తి, యాకయ్య పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించాలి



తేమ శాతం పరిశీలిస్తున్న అధికారులు

మహబూబాబాద్ రూరల్: డీఆర్డీఏ సెర్ప్ ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో నిర్వాహకులు ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించాలని అడిషనల్ డీఆర్డీఓ జయశ్రీ అన్నారు. మహబూబాబాద్ మండలంలోని పర్వతగిరి, ఆమనగల్, ముడుపుగల్ గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను జయశ్రీ, తహసీల్దార్ భగవాన్ రెడ్డి మంగళవారం సందర్శించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఇన్‌చార్జ్‌లు ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉండాలని ఆదేశించారు. అదేవిధంగా రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎం తిలక్, ధాన్యం కొనుగోలు కేంద్రాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఒకరిపై కేసు నమోదు

నర్సింహులపేట: మండలంలోని బొజ్జన్నపేట గ్రామానికి చెందిన ఓ ట్రాక్టర్ యజమానిపై మంగళవారం రాత్రి కేసు నమోదు చేసినట్లు ఎస్సై మాలోతు సురేష్ తెలిపాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. కౌసల్యదేవిపల్లి శివారులోని ఆకేరు వాగు నుంచి సోమవారం అర్ధరాత్రి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నారని గ్రామానికి కొందరు వ్యక్తులు తహసీల్దార్‌కు ఫోన్‌లో తెలిపారు. రెవెన్యూ సిబ్బంది సంఘటనా స్థలానికి వెళ్లగా రెండు ట్రాక్టర్లను పట్టుకొని పీఎస్‌కు తరలిస్తుండగా ట్రాక్టర్ యజమాని సిబ్బందితో గొడవపడ్డాడు. రెవెన్యూ సిబ్బంది ఫిర్యాదు మేరకు ట్రాక్టర్ యజమానిపై అనిల్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపాడు.

ఓటు ప్రాముఖ్యత తెలుసుకోవాలి



నెల్లికుదురు: మాట్లాడుతున్న శ్రీనివాస్

నెల్లికుదురు: ప్రజాస్వామ్యంలో యువత పాత్ర కీలకమని, ఓటర్ల నమోదులో యువత భాగస్వాములు కావాలని ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ బండి శ్రీనివాస్ సూచించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో యువ ఓటర్ల అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ అనిల్ అధ్యాపకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మరిపెడ: ఓటు హక్కు ప్రాముఖ్యతను తెలుసుకోవాలని స్థానిక సెంటగస్టీయస్ పాఠశాల ప్రిన్సిపాల్ సిస్టర్ దీన అన్నారు. ఈ మేరకు మరిపెడలో మంగళవారం విద్యార్థులతో ఓటు హక్కు ప్రాముఖ్యతపై ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సిస్టర్ ఫ్రాన్సీ, నిబిస్‌జపమాల, ధనమ్మ, షాహిదా, విజయ పాల్గొన్నారు.

గార్ల: 18 సంవత్సరాలు నిండిన ప్రతీ ఒక్కరు కొత్త ఓటు కోసం దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ ఇస్లావత్ చాంప్లా సూచించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీఓ ప్రసాదరావు, అధ్యాపకులు రవీందర్, సోమన్న, సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంపై అవగాహన ఉండాలి



కొత్తగూడ: మాక్ పోలింగ్‌లో పాల్గొన్న విద్యార్థులు

కొత్తగూడ: ప్రజాస్వామ్యంపై విద్యార్థి దశ నుండే అవగాహన కలిగి ఉండాలని ఏటీడీఓ భాస్కర్ అన్నారు. మండలకేంద్రంలోని క్రీడా పాఠశాలలో మాక్ పోలింగ్ నిర్వహించారు. ఈసందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ.. ఓటు హక్కు వినియోగించుకుని ప్రజాప్రతినిధులను ఎన్నుకోవడం వరకు విద్యార్థులు స్వయంగా తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సారయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దంతాలపల్లి: మండలంలోని పెద్దముప్పారం జెడ్పీ హెచ్ఎస్ పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు ఓటింగ్‌పై మాక్‌పోలింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శంకరయ్య, ఉపాధ్యాయులు శ్రీనివాస్, మోహన్, రామచంద్రు పాల్గొన్నారు.

వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న వీఓఏలు, నాయకులు

మహబూబాబాద్: వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు వీఓఏలకు ఇచ్చిన హామీని అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కుంట ఉపేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాడు. సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట వీఓఏలు ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ఉపేందర్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాలలో మహిళా సాధికారత కోసం ప్రభుత్వం పథకాల అమలు కోసం శ్రమిస్తున్న ఐకేపీ వీఓఏల సమస్యలను పరిష్కరించాలన్నారు. సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు వెలిశాల సుధాకర్, నీలం కృష్ణవేణి, వసంత, హన్మంతు, అనిత, ఉమ, మంజుల, కృష్ణకుమారి, శ్రీను, మనోహర్ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

యూటీఎఫ్ మండల కమిటీని ఎన్నిక



మహబూబాబాద్ అర్బన్: టీఎస్ యూటీఎఫ్ మానుకోట మండల నూతన కమిటీని ఎన్నుకున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు మురళీకృష్ణ మంగళవారం తెలిపాడు. మండల అధ్యక్షుడు మేకల కుమార్, ప్రధాన కార్యదర్శి కె.రాజశేఖర్, ఉపాధ్యక్షుడు కోటూరు శ్రీనివాస్, బి.సౌభాగ్య, కోశాధికారి సోమేశ్వరరావు, ఆడిటర్ ఎండి. షబ్బీర్, కార్యదర్శులు భరత్ కుమార్, రామ్, కృష్ణయ్య, వెంకన్న, నాగేశ్వర రావు, సునీత, వీరబ్రహ్మం ఎన్నుకున్నామన్నారు.

పర్యావరణాన్ని రక్షించాలి

మహబూబాబాద్ రూరల్: పర్యావరణాన్ని రక్షిస్తే మనకు వందరేట్లు ఫలితాన్ని తిరిగి ఇస్తుందని టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్ అన్నారు. అమ్మ పేరుతో మొక్కలు నాటే కార్యక్రమంలో భాగంగా ప్రజా హృదయం స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో హరిత మిత్ర అవార్డు గ్రహీత, మొక్కల సంరక్షకులు దైద వెంకన్న మంగళవారం సీఐ దేవేందర్‌కు పూల మొక్కలు అందజేశారు.

పంట క్షేత్రాల సందర్శన

కేసముద్రం: మండలంలోని కల్వల గ్రామంలో గంట దామోదర్‌రెడ్డి అనే రైతుకు చెందిన వ్యవసాయ క్షేత్రాన్ని ప్రొఫెసర్ జయశంకర్ విశ్వవిద్యాలయం వరంగల్‌కి చెందిన బీఎస్సీ అగ్రికల్చర్ విద్యార్థినులు మంగళవారం సందర్శించారు.

సీపీఎం మండల కార్యదర్శిగా సైదులు

నెల్లికుదురు: సీపీఎం మండల శాఖ కార్యదర్శిగా మండలంలోని మునిగలవీడు గ్రామానికి చెందిన ఇసంపెల్లి సైదులను ఏకగ్రీవంగా ఎనున్నకున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ మంగళవారం ప్రకటించాడు. సభ్యులుగా తిలక్‌బాబు, బాబుగౌడ్, నర్సయ్య, బాణాలు యకాయ్య, ఏకాంతం, రామారాజు, సమ్మయ్య, ఉప్పలయ్య, యాకయ్యలను ఎన్నుకున్నారు.

మూఢనమ్మకాలతో నష్టపోవద్దు

కొత్తగూడ: మూఢనమ్మకాలతో ఆర్థికంగా నష్టపోవద్దని ఎస్సై కుశకుమార్ అన్నారు. మండలంలోని ఎదుళ్లపల్లి గ్రామంలో నిర్వహించిన పోలీస్ కళాజాతా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మూఢనమ్మకాలు డ్రగ్స్, గంజాయి వంటి వాటితో జరిగే నష్టాలను పోలీస్ కళాకారులు నాటకాలు, మ్యాజిక్‌లతో ప్రజలకు వివరించారు.

సర్వేలో ఎరుకలకు కోడ్ కేటాయించాలి

తొర్రూరు: కుటుంబ సర్వేలో ఎరుకల భాష, వృత్తికి కోడ్ కేటాయించాలని ఎరుకల సంఘం మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు నడిగడ్డ శైలజ కోరారు. మంగళవారం డివిజన్ కేంద్రంలో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు రాయపురం శ్రీను, తిరుపతి ఏసు, వెంకన్న పాల్గొన్నారు.

లక్ష్యంతో ఉన్నత స్థాయికి ఎదగాలి

గూడూరు: ఒక లక్ష్యంతో శ్రద్ధగా చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఎంఈఓ రవికుమార్ అన్నారు. మండలంలోని తీగలవేణి జెడ్పీహెచ్ఎస్‌ను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సమ్మాళ్వార్, ఉపాధ్యాయులు ఫారూఖ్, లక్ష్మయ్య, ఉదయ్‌కిరణ్, రేణుక, రాములు, ప్రవీణ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన

కేసముద్రం: మాదకద్రవ్యాల వ్యతిరేక నివారణ ఉద్యమంలో భాగంగా మంగళవారం మండలంలోని పెనుగొండ జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్సై మురళీధర్‌రాజు మాట్లాడుతూ.. బాల్యం నుంచి మాదకద్రవ్యాల వ్యతిరేక, నివారణ ఉద్యమంలో విద్యార్థులు భాగస్వాములైనప్పుడు మంచి సమాజ నిర్మాణము సాధ్యమవుతుందన్నారు.

సర్వే పరిశీలన

డోర్నకల్: సీరోలు మండలం మన్నెగూడెం గ్రామంలో జరుగుతున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను మంగళవారం జెడ్పీ డిప్యూటీ సీఈఓ నర్మద పరిశీలించారు.

నెల్లికుదురు: ఇంటింటి కుల గణన సర్వేలో ప్రతి ఎన్యుమరేటర్ 20 కుటుంబాలు తగ్గకుండా సర్వే నిర్వహించాలని ఎంపీడీఓ బాలరాజు ఎన్యుమరేటర్లకు సూచించారు.

జోనల్‌స్థాయి క్రీడా పోటీలు

మరిపెడ: విద్యార్థులకు చదువుతోపాటు ఆటలు కూడా ముఖ్యమేనని జోనల్ అధికారి స్వరూపరాణి అన్నారు. మరిపెడ మున్సిపాలిటీ పరిధిలోని సాంఘిక సంక్షేమ గురుకులంలో జరుగుతున్న జోనల్‌స్థాయి క్రీడలు రెండోరోజు ఆమె హాజరై మాట్లాడారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు.

ఎస్సీ వర్గీకరణను అమలు చేయాలి

కేసముద్రం: ఎస్సీ వర్గీకరణను వెంటనే అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి అనిల్‌కుమార్ డిమాండ్ చేశారు. మండలంలోని కల్వల గ్రామంలో ఆయన మాట్లాడారు.

విద్యుదాఘాతంతో పాడిగేదె మృతి

గార్ల: విద్యుదాఘాతంతో పాడిగేదె మృతిచెందిన సంఘటన మంగళవారం గార్లలో చోటుచేసుకుంది. గార్లలోని అంబేద్కర్‌నగర్‌కు చెందిన సింగు ప్రేమ్‌కుమార్‌కు చెందిన గేదె స్థానిక సీహెచ్‌సీ ఆస్పత్రి వెనుకభాగంతో మేత మేస్తూ పక్కనే ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు తాకడంతో అక్కడికక్కడే మృతిచెందింది. గేదె విలువ రూ.70వేలు ఉంటుందని బాధితుడు పేర్కొన్నాడు.

గుడుంబా స్వాధీనం

దంతాలపల్లి: మండల పరిధిలో గల వివిధ గ్రామాల్లో మంగళవారం ఆబ్కారీ శాఖ తొర్రూరు వారి ఆధ్వర్యంలో ముమ్మర దాడులు నిర్వహించి 44 లీటర్ల గుడుంబా, ఓ ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకొని ఆరుగురిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై తిరుపతి మంగళవారం తెలిపారు. మండలంలోని కుమ్మరికుంట్ల గ్రామంలో ఇద్దరు వ్యక్తులు, రేపోణి గ్రామంలో ఒక్కరు, పెద్దముప్పారం గ్రామంలో ముగ్గురు వ్యక్తులు గుడుంబా తయారు చేస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. వారిపై కేసులు నమోదు చేసి స్థానిక తహసీల్దారు కాటం చంద్ర రాజేశ్వర్ ముందు బైండోవర్ చేశామన్నారు. అయితే పట్టుబడిన వారి నుంచి ఓ కానిస్టేబుల్ రెండు వేల రూపాలయల లంచం తీసుకొని వారిపై కేసులు నమోదు చేయకుండా తహసీల్దార్ కార్యాలయంలో బైండోవర్ చేశారని సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ విషయంపై ఎస్సై తిరుపతిని వివరణ కోరగా.. ఎవ్వరి వద్ద లంచం తీసుకోలేదని, సోషల్ మీడియాలో వస్తున్న వార్తలు అవాస్తవం అన్నారు.

జీఓ 34పై విచారణ జరిపించాలి



నిరసన తెలుపుతున్న నాయకులు

నెహ్రూసెంటర్: గత ప్రభుత్వం మానుకోటకు ఇచ్చిన రూ.50కోట్ల నిధులకు సంబంధించిన గారడీ జీఓ 34పై రాష్ట్ర ప్రభుత్వం విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి డిమాండ్ చేశాడు. అభివృద్ధి పనుల కోసం ఏర్పాటు చేసిన పైలాన్‌పై నల్లవస్త్రం కప్పి జెండాలతో సీపీఐ నాయకులు వినూత్నంగా మంగళవారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో సీపీఐ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ బి.అజయ్‌సారథిరెడ్డి, పెరుదు కుమార్, రేషపల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్న, వీరవెల్లి రవి, వెలుగు శ్రావణ్, మాలోత్ రవీందర్, చిదిరాల జ్ఞానేశ్వర్, తోట రాజకుమారి, తదితరులు పాల్గొన్నారు.

అంకె మారింది.. జరిమానా పడింది

కేసముద్రం: రాంగ్ పార్కింగ్‌లో నిలిపిన కారు నంబర్ ప్లేట్‌లో చివరి అంకె 8కి బదులుగా, 6గా కెమెరా నిర్ధారించడంతో మరో వ్యక్తికి జరిమానా పడిన సంఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారంగా.. తన కారు నంబర్ టీఎస్ 07 ఎఫ్‌డీ 2226 కాగా, హైదరాబాద్‌లో రాంగ్ పార్కింగ్‌లో నిలిపిన మరో టీఎస్ 07 ఎఫ్‌డీ 2228 నంబర్ గల కారు ఫొటోతో జరిమానా వేసినట్లు ఆయన ఆరోపించాడు. పొరపాటున నంబర్ ప్లేట్‌లోని చివరి 8అంకె బదులుగా 6గా కెమెరా నిర్ధారించడంతో రూ.1000ల జరిమానా చెల్లించాలంటూ మెసేజ్ వచ్చిందన్నాడు. దీనిపై సిటీ పోలీసులు స్పందించి తనకు పడిన జరిమానాను తొలగించాలని కోరాడు. ఈమేరకు సంబంధిత అధికారులకు తన వద్ద ఉన్న ఆధారాలతో ఫిర్యాదు చేయనున్నట్లు బాధితుడు తెలిపాడు.

కొనుగోలు కేంద్రం ఏర్పాటు

మరిపెడ రూరల్: దేశానికి అన్నం పెట్టే రైతు మేలు కోరే కాంగ్రెస్ ప్రభుత్వమని మండలంలోని పురుషోత్తమాయగూడెం మాజీ సర్పంచ్ నూకల అభినవ్ రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని పురుషోత్తమాయగూడెంలో ఐకేపీ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి వీరసింగ్, రాములు, దుర్గయ్య, శ్రీనివాసచారి పాల్గొన్నారు.

మాతృస్వామ్య వ్యవస్థతో సమస్యలు పరిష్కారం



కురవి: మాతృస్వామ్య వ్యవస్థ నిర్మాణంతో మహిళల సమస్యలు పరిష్కారం అవుతాయని భారత జాతీయ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి అన్నారు. మండల కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో మంగళవారం సంఘం జిల్లా కౌన్సిల్ సమావేశం పద్మ అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రకృతిలో, మానవ సమాజంలో స్త్రీ సగభాగం కాబట్టి మహిళకు సగభాగం హక్కులు, బాధ్యతలు పురుషుడితో సమానంగా ఉండాలని తెలిపారు. ఈ సమావేశంలో ఏపూరి లతదేవి, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్‌రెడ్డి, మామిండ్ల సాంబలక్ష్మి, సీపీఐ మండల కార్యదర్శి కరణం రాజన్న, వర్కింగ్ ప్రెసిడెంట్ ఫాతిమా పాల్గొన్నారు.